# అంధకారంలో అన్వేషణ




**టేబిల్** మీద ఉన్న ఫైలు చూస్తున్నాడన్న మాటే కానీ విశ్వనాథం మనసు మనసులో లేదు. అతని ఆలోచనలన్నీ సుహాసిని మీదే ఉన్నాయి. కనులముందు పదే పదే ఆమె రూపమే కదులుతూంది.

ఫైల్లోనించి తల ఎత్తి ఒక్కసారి తన చుట్టూ ఉన్న తోటి ఉద్యోగుల వైపు చూశాడు. అందరూ వీరి పనుల్లో వాళ్ళు మునిగిపోయి ఉన్నారు. అతను దృష్టిని మరలించి కిటికీ నించి రోడ్డు మీదికి చూశాడు. రోడ్డు వారగా ఉన్న బస్ స్టాపు దగ్గర ఒక ఆమె నిలబడి ఉంది. ఆమెను చూడగానే అప్రయత్నంగా విశ్వనాథం ముఖం విప్పారింది. ఆమె దాదాపు సుహాసిని లాగానే కనుపించింది.

ఆ క్రితం రోజా సాయంత్రమే విశ్వనాథం, అతని తల్లి కలిసి పెళ్ళి చూపులు చూడటానికి ఆ వూళ్ళోనే మరొక పేటలో ఉంటున్న ఒకరి ఇంటికి వెళ్ళారు. పెళ్ళి కూతురు పేరు సుహాసిని. ఆమెకు తండ్రి లేడు. తల్లి ఉంది.

పెళ్ళిచూపులు మొదలయ్యాయి. సుహాసిని వచ్చి విశ్వనాథం ఎదురుగా కూర్చున్నది. మొదటి చూపు లోనే ఆమె విశ్వనాథం మనసును దోచుకున్నది. ఆమె అందంగా ఉంది. మంచి ఎత్తు, ఎత్తుకు తగిన లావు. పొడుగాటి జడ. పొందికగా ఉంది.

సుహాసినిలో ఎలాంటి లోపమూ విశ్వనాథానికి

కనుపించలేదు. ఆమె ఇంటర్ పాసయింది. ప్రస్తుతం ఒక ప్రయివేట్ కంపెనీలో టైపిస్టుగా ఉద్యోగం చేస్తోంది. అతనికే కాకుండా అతని తల్లికి కూడా సుహాసిని బాగానే నచ్చింది. ఆమె సుహాసినిని కొన్ని ప్రశ్నలు అడిగింది. సుహాసిని అన్నింటికీ చిరు నవ్వుతో జవాబు లిచ్చింది. సుహాసిని గొంతు కూడా బాగానే ఉందనుకున్నారు తల్లీ, కొడుకూ.

రెండు గంటల తరవాత పెళ్ళిచూపులు ముగి శాయి. సుహాసిని లోపలికి వెళ్ళబోతూ ఒక్కసారి విశ్వనాథం కళ్ళలోకి చిలిపిగా చూసి వెళ్ళిపోయింది. అతనికి ఆ చూపులో నరనరాల్లోనూ విద్యుత్తు ప్రవహించినట్టనిపించింది.

బయటికి వస్తూ ఏ విషయం రెండు, మూడు రోజుల్లో కబురు చేస్తానన్నది విశ్వనాథం తల్లి సుహాసిని తల్లితో.

సరే నన్న దామె.

ఇద్దరూ ఇంటికి వచ్చారు.

ఇంట్లోకి వచ్చిన తరవాత—"నాకు ఆ అమ్మాయి నచ్చిందమ్మా. కట్నం విషయంలో మనకు పట్టింపు లేదు కదా? మనకు ఇష్టమేనని రేపు కబురు చెయ్య వచ్చును గదా?" అన్నాడు విశ్వనాథం, తల్లితో.

ఆమె నవ్వి కొడుకుతో—"పిచ్చివాడా! అమ్మాయి అందంగా ఉండగానే సరిపోయిందా? గుణంకూడా చూసుకోవాలి. అందులోనూ ఉద్యోగం చేస్తున్న అమ్మాయి. మనం ఆ అమ్మాయి గురించి బాగా విచారించి చేసుకోవాలి. ఆమె పని చేసే కంపెనీలో నీకు తెలిసిన వాళ్ళెవరయినా ఉంటే అమ్మాయి గురించి అడిగి చూడు" అన్నది.

విశ్వనాథం మాట్లాడలేదు. నిజానికి తల్లి ఆలో చన అతనికి నచ్చలేదు. సుహాసిని కారెక్టర్ గురించి ఎంక్వయిర్ చెయ్యటం చాలా నీచమయిన పనిలా తోచింది. ఉద్యోగం చేస్తున్న అమ్మాయి అయితే గుణం మంచిది కాకుండా ఉండాలని లేదు కదా అనుకున్నాడు. అయినా, అతనికి ఆరా తీయక తప్ప లేదు. లేకపోతే తల్లి వూరుకోదు. ఇలా అనుకొని ఆమె పనిచేసే కంపెనీలో తన స్నేహితు లెవరయినా పని చేస్తున్నారేమో గుర్తు చేసుకున్నాడు విశ్వనాథం. అతనికి హనుమంతరావు గుర్తుకు వచ్చాడు. అతనికి ఆరు నెలల క్రితమే ఆ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఆ మరురోజు సాయంత్రమే అతన్ని కలవాలను కున్నాడు విశ్వనాథం.

ఆ రాత్రి అతనికి నిద్ర పట్టలేదు. అతని గుండె నిండా సుహాసిని. తన భార్య అయినట్టుగానే కలలు కన్నాడు విశ్వనాథం. ఎప్పటికో తెల్లవారు జామునకు నిద్రపోయాడు.

తెల్లవారిన తరవాత విశ్వనాథం రోజూకంటే ఉత్సాహంగా ఉన్నాడు. ఈరోజు ఈ ఎంక్వయిరీ పూర్తి అయితే త్వరలో సుహాసినిని తన భార్యను చేసుకోవచ్చు ననుకున్నాడు. సుహాసిని గురించిన ఆలోచనలతోనే ఆఫీసుకు వచ్చాడు.

వేగంగా వచ్చి హోటలు ముందు ఆగిన బస్సు చూడగానే విశ్వనాథం ఆలోచనలు చెదిరిపోయాయి. సుహాసినిలా ఉన్న ఆ అమ్మాయి బస్సులో ఎక్కింది. వెంటనే వెళ్ళిపోయింది బస్సు.

ఒకసారి చేతికి ఉన్న వాచీ కేసి చూసుకున్నాడు

## వీలునామా రహస్యం

ఒక లాయరు వీలునామా రాస్తూ తను సంపాదించిన డబ్బంతా పిచ్చివాళ్ళకూ, మూర్ఖులకూ ఉపయోగించాలని దానిలో కోరాడు. అయినవాళ్ళు ఆయన దగ్గరకు వెళ్ళి-"ఇదేమి పిచ్చి పని, స్వామీ?" అని అడిగారు. ఆయన తాపీగా ఇలా జవాబిచ్చాడు- "ఈ డబ్బంతా వారి వల్లనే సంపాదించుకున్నాను. ఇది మళ్ళీ వాళ్ళకే ఖర్చు చేస్తున్నాను" అంతే!

---

విశ్వనాథం. లంచ్‌కి ఇంకో ఇరవై నిమిషాలు వ్యవధి ఉంది. అతనికి సుహాసిని గురించి తెలుసుకోవ టానికి సాయంత్రం వరకు ఆఫీసులోనే ఉండాలను కుంటే విసుగనిపించింది. అతనికి అప్పటి కప్పుడే ఆమె గురించి ఫార్మల్‌గా తెలుసుకుంటే సగం భారం తీరినట్లుంటుం దనిపించింది.

తనకు సుహాసిని గురించి ఇన్ఫర్మేషనిచ్చే హనుమంతరావును కలవాలంటే అతని ఇంటికి వెళ్ళవలసిందే. అతని ఇల్లు చాలా దూరం. తీరా వెళ్ళితే ఉంటాడో, ఉండడో? లంచ్ టైములో అయితే ఆఫీసులోనే కలుసుకోవచ్చు. ఆఫీసు అక్కడికి దగ్గరే. అందుకని విశ్వనాథం పెర్మిషన్ తీసుకుని ఆఫీసు నుంచి బయటికి వచ్చాడు.

---

## జొన్నలగడ్డ అరుణ

---

రోడ్డు మీదికి రాగానే అతనికి బస్సుస్టాపు దగ్గర ఆగి ఉన్న రిక్షా కనుపించింది. అతను దానిలో ఎక్కి అడ్రెసు చెప్పాడు.

కదిలింది రిక్షా.

పాంటు జేబులో నించి సిగరెట్టు పాక్ బయటికి తీశాడు విశ్వనాథం. ఒక సిగరెట్టు ముట్టించాడు.

నున్నగా ఉన్న తారురోడ్డు మీద వాలు గాలిలో రివ్వున దూసుకుపోతూంది రిక్షా. విశ్వనాథం గుండెలో సన్నగా అలజడి మొదలయింది. సుహాసిని గురించి హనుమంతరావు ఏమని చెబుతాడో? నిజానికి ఆమె ప్రవర్తన ఎటువంటిదో? ఏమో? ఎలా తెలుస్తుంది?

పావు గంట తరవాత అదురుతున్న గుండెను అదుపులో ఉంచుకుంటూ ఆ ఆఫీసు ముందు దిగాడు. రిక్షావాడికి డబ్బు లిచ్చి లోపలకు నడిచాడు. అప్పుడే ఆఫీసులో నించి ఉద్యోగులు బయటికి వచ్చి కాంటీన్ వైపు వెళుతున్నారు. వాళ్ళలో విశ్వనాథానికి హనుమంతరావు కనుపించలేదు.

నిమిషం తరవాత ఒక్కడే వస్తూ కనుపించాడు హనుమంతరావు. అతను విశ్వనాథాన్ని చూడగానే నవ్వుతూ విష్ చేశాడు.

"ఏం గురూ, ఇలా వచ్చావ్? ఏమిటి కథ?"

"ఒక చిన్న ఇన్ఫర్మేషన్ కావాలి." చెప్పాడు విశ్వనాథం.

"కాంటీన్‌కు వెళ్ళి మాట్లాడుకుందాం, పద" అని ఆ వైపు నడిచాడు.

ఇద్దరూ కాంటీన్‌లోకి వెళ్ళి ఒక మూలగా ఎదురెదురుగా కూర్చున్నారు.

హనుమంతరావు ఏవో పదార్థాలకు ఆర్డ రిచ్చాడు. కాంటీనంతా కోలాహలంగా ఉంది.

"ఇంతకూ నీకు దేని గురించి ఇన్ఫర్మేషన్ కావాలి, భాయ్?" అడిగాడు హనుమంతరావు బల్ల మీదికి వంగి.

"మీ ఆఫీసులో పని చేస్తున్న సుహాసిని గురించి."

"సుహాసిని గురించా?"

"అవును."

"లైన్‌లోకి వస్తున్నావా?" నవ్వుతూ అడిగాడు హనుమంతరావు.

"అదేం లేదు. ఆమె ఎలాంటిదో తెలియాలి."

హనుమంతరావు ఏదో అనబోయేటంతలో సర్వరు పదార్థాలను వారి ముందు ఉంచి వెళ్ళి పోయాడు.

"ఇంతకూ అసలు విషయం చెప్పలేదు నువ్వు." తింటూ అడిగాడు హనుమంతరావు.

"నా స్నేహితుడు ఒకతను ఆమెను పెళ్ళి చేసు కోవాలనుకుంటున్నాడు. ఆమె ఇక్కడ పని చేస్తోందని తెలిసింది. అతనికి ఈ ఆఫీసులో తెలిసిన వాళ్ళు ఎవ్వరూ లేరు. నన్నడిగితే నువ్వు తెలుసునని చెప్పాను. వెంటనే నన్ను ఆమె గురించి తెలుసుకు రమ్మని పంపించాడు. ఇదీ విషయం" అన్నాడు.

హనుమంతరావు రెండు నిమిషాల తరవాత — "అతను నీకు మంచి ఫ్రెండా?" అని అడిగాడు.

తల వూపాడు విశ్వనాథం. కావాలనే హనుమంత రావుకు అలా చెప్పాడు.

"ఉన్న విషయం ఉన్నట్టుగా చెప్పితే అతను బాధపడడు గదా?" మళ్ళీ అడిగాడు.

"బాధ పడే దేముంది? ఆమె కాకపోతే ఇంకొకరు" అన్నాడు మెల్లగా. అతనిలో అప్పుడే ఏదో అను మానం పొడచూపింది.

విశ్వనాథం అలా అనగానే—"అయితే, అతన్ని ఈ సంబంధం వదులుకోమని చెప్పు" అన్నాడు హనుమంతరావు.

"వదులుకోమనా?!"

"అవును. సుహాసిని మంచిది కాదు. మా ఆఫీసర్‌కూ, దానికీ లావాదేవీలు ఉన్నాయి. ఈ విషయం అందరికీ తెలుసు. అసలు ఈ ఉద్యోగం దానికి ఎట్లా వచ్చిందనుకున్నావ్? వాడే ఇచ్చాడు. వా డొక్కడితోనే కాదు, ఇంకో ఇద్దరితో కూడా సుహాసినికి చాలా గట్టి సంబంధాలు ఉన్నాయి. దానికి వచ్చే జీతంతో అది ఫామిలీని పోషిస్తోం దనుకుంటున్నావా? తల ఒక వెయ్యి వేసి ముందుకు నెట్టుతున్నారు. మీ స్నేహితుణ్ని ఈ సంబంధం గురించి మరిచిపొమ్మని చెప్పు. ఏమయినా నన్ను కలుసుకోవటం మంచిదే అయింది" అన్నాడు హను మంతరావు, సీరియస్‌గా.

వినిపోయాడు విశ్వనాథం. అతనికి మతి పోయిన ట్టనిపించింది. ఒక్క క్షణం అతనికి ఏమీ అర్థం కాలేదు. అతని అంచనాలన్నీ తలకిందులయినాయి. సుహాసిని మంచిది కాదా? ఆఫీసర్‌తో ఆమెకు సంబంధం ఉందా? ఇంకో ఇద్దరితో కూడా ఆమెకు సంబంధాలు ఉన్నాయా? ఇది నిజమా?

"ఏమిటో హనుమంతరావుగారు సీరియస్‌గా

మాట్లాడుతున్నారు?" అంటూ వచ్చి అతని పక్కనే కూర్చున్నాడు మరొక ఉద్యోగి.

విశ్వనాథం ఎందుకోసం వచ్చింది, తను ఏమి చెప్పిందీ అంతా చెప్పాడు హనుమంతరావు.

"సుహాసినా?! అది పెద్ద కాటా, సార్. దాన్నెవ డంటే పెళ్ళి చేసుకునేది? కాటాకు పెళ్ళా?" పెద్దగా నవ్వాడతను.

నిజంగానే విశ్వనాథానికి తల తిరిగిపోయింది. ఇక నిమిషం కూడా అక్కడ కూర్చో బుద్ధి కాలేదు. ఒకసారి వాచీకేసి చూసుకొని, "ఇక నే వెళతాను. ఆఫీసు టైమవుతూంది. ఈ విషయాలన్నీ నా ఫ్రెండ్‌తో చెబుతాను. థాంక్స్!" అని లేచి నిలుచున్నాడు.

"నాకు తెలిసిన విషయం నేను చెప్పాను. నీ ఫ్రెండుకు సుహాసినిని చేసుకోవద్దని చెప్పు." మరొకసారి హెచ్చరిక చేశాడు హనుమంతరావు.

తల ఊపుకుంటూ, కళ్ళొత్తుకుంటూ బయటికి వచ్చాడు విశ్వనాథం.

మనసంతా అదోకలా అయిపోయింది. తను సుహాసిని మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. ఆమెను తన భార్యగా ఊహించుకుని ఎన్నో కలలు కన్నాడు.

---




శ్రీమతి ఇందిరాగాంధి
ప్రధానమంత్రి

# ఉజ్జ్వల భవిష్యత్తులోకి ఆంధ్రప్రదేశ్



శ్రీ టి అంజయ్య
ముఖ్యమంత్రి

ప్రధానమంత్రి 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం కీ.శే. శ్రీ సంజయ్ గాంధి 5 సూత్రాల కార్యక్రమాన్ని మరింత పటిష్ఠవంతంగా అమలు జరపడానికి ప్రాధాన్యత నిస్తూ ఆంధ్రప్రదేశ్ యిప్పుడు రజతోత్సవ సంవత్సరాన్ని జరుపుకుంటోంది. నవంబరు నెల మొదటి 25 రోజులలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలను ప్రముఖంగా వివరించడం జరిగింది.

శ్రీ టి. అంజయ్య నాయకత్వంలో రైతులు, పారిశ్రామిక కార్మికులు, బలహీన వర్గాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూనే సామాన్యమానవుని సంక్షేమానికి అనేక చర్యలు తీసుకున్నారు.

* గ్రామాలలో రక్షిత మంచినీటి సరఫరా. రు. 480 కోట్ల పెట్టుబడితో కూడిన బృహత్ ప్రణాళిక రూపొందించబడింది.
* రు. 350 కోట్ల ఖర్చుతో (పనికి ఆహారం కార్యక్రమం ద్వారా) గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన.

అవినీతిని నిర్మూలించడానికి కృషి చేయడం ద్వారా స్వచ్ఛమైన పరిపాలన అందించడం. లోక్ ఆయుక్త సంస్థ ఏర్పాటు చేయడానికి శాసనం ప్రవేశపెట్టడం. అవినీతిని కనుగొనడానికి ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయడం.

సమాజంలోని వివిధ మతాలు, భాషావర్గాల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి వీలుగా రాష్ట్ర సమైక్యతా మండలి ఏర్పాటు చేశారు.

రజతోత్సవ సంవత్సరంలో వివిధ రంగాలలో అభివృద్ధి కార్యక్రమాలను తీవ్రతరంగా అమలు జరుపడానికి ఒక్కొక్క నెలను ప్రత్యేకించారు.

| | | |
|---|---|---|
| డిసెంబరు | ... | ఇళ్ళ స్థలాలు |
| జనవరి | ... | వ్యవసాయ భూములు |
| ఫిబ్రవరి | ... | ఋణాలు |
| మార్చి | ... | గ్రామీణ విద్యుదీకరణ |
| ఏప్రిల్ | ... | కుటుంబ సంక్షేమం |
| మే | ... | కార్మికులు, వృత్తిపనివారు |
| జూన్ | ... | రైతుల సంక్షేమం |
| జూలై | ... | వన మహోత్సవం |
| ఆగస్టు | ... | చేనేత పనివారు |
| సెప్టెంబరు | ... | మహిళలు, శిశు సంక్షేమం |
| అక్టోబరు | ... | యువజన సంక్షేమం |

సమాచార, పౌర సంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటితం.

DIPR/40645/Advt/C1-3/80

విపరీకి ఇలా జరిగిందేమిటి? ఇంకా నయం! తను గుడ్డిగా పెళ్ళికి ఒప్పుకోలేదు — అనుకున్నాడు. ఆఫీసుకు వెళ్ళ బుద్ధి కాలేదు. రిక్షా ఎక్కి తన ఇంటి అడ్రెసు చెప్పాడు విశ్వనాథం.

*   *   *

నెల రోజులు గడిచాయి.

ఒక రోజు లంచ్ అవర్‌లో విశ్వనాథం, మరి కొందరు ఉద్యోగులు వాళ్ళ ఆఫీసు కాంటీన్‌లో మాట్లాడుకుంటున్నారు. వాళ్ళలా మాట్లాడుకుంటున్నప్పుడు విశ్వనాథం కొలీగ్ శివరావు ఒక ముప్పై ఏళ్ళతన్ని వెంట తీసుకు వచ్చాడు.

"రండి, శివరావుగారూ. ఎవరో అతిథిని తీసుకు వచ్చారే?" అన్నాడు ఒక ఉద్యోగి.

శివరావు నవ్వుతూ, తను తీసుకు వచ్చిన అతన్ని వారందరికీ పరిచయం చేశాడు.

అతని పేరు గౌతమ్ ప్రసాద్. ఒక బాంకులో పని చేస్తున్నాడు. ఇంకా పెళ్ళి కాలేదు.

"ఇంతకూ ఇతను వచ్చిన పనేమిటో చెబుతాను. ఇరవై రోజుల క్రితం మన సెక్షన్‌లో టైపిస్టుగా వచ్చిన రాజేశ్వరిని ఇతడు పెళ్ళి చేసుకోవా లనుకుంటున్నాడు. ఆమె గురించి తెలుసుకోవాలని వచ్చాడు." అందరికీ చెప్పాడు శివరావు.

వెంటనే విశ్వనాథం కనుల ముందు సుహాసిని రూపం కదిలింది. తను ఆమెను పెళ్ళి చేసుకోవాలని కోరుకోవడం, తల్లి కోరిక మీద ఆమె ప్రవర్తన గురించి చేసిన ఎంక్వయిరీ అన్నీ గుర్తు వచ్చాయి.

ఎవరో మాట్లాడటంతో అతని ఆలోచనలు చెదిరిపోయాయి.

"గౌతమ్ ప్రసాద్‌గారూ! వెయ్యి అబద్ధాలాడి ఒక మారేజి చెయ్యమన్నారు. నిజమే. కాని, మీరు శివరావుగారి స్నేహితులు. అంటే, మాకు స్నేహితులే కదా? అటువంటి మీకు ఘోరమైన అన్యాయం జరగబోతూంటే చూస్తూ ఎలా వూరుకోగలం చెప్పండి? దయచేసి మీరు రాజేశ్వరిని గురించి ఆలోచించటమే మానుకొని ఆమెను మరిచిపొండి" అన్నాడు ఒక క్లర్కు, ప్రార్థిస్తున్నట్లుగా.

"ఎందు కలా అంటున్నారు?" ఏమీ అర్థం కాక పోవడంతో అడిగాడు గౌతమ్ ప్రసాద్.

"ఎందుకేమిటి, సార్? రాజేశ్వరి గురించి ఈ ఆఫీసులో ప్యూను మొదలు ఆఫీసరు వరకు ఎవర్ని అడిగినా చెబుతారు, ఆమె ఎలాంటిదో? అదొక పెద్ద హాండు. మానేజర్‌తో విపరీతంగా తిరుగుతూంది. వాడే దాన్ని ఏలూరునుంచి ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. అలాంటి మనిషిని మీరు చేసుకుంటారా? వద్దు, సార్, వద్దు. ఆంధ్రదేశంలో అందమైన అమ్మాయిలకు కొరత లేదు. మరి ఎవరి నయినా చేసుకోండి" అన్నాడు తను మళ్ళీ, శ్రేయోభిలాషిలా.

అతని మాటలు వినగానే విశ్వనాథానికి ఎవరో కొరడాతో వీపు మీద కొట్టినట్లనిపించింది. ఇత నేమిటి రాజేశ్వరి గురించి ఇలా చెబుతున్నాడు? అనుకున్నాడు. విశ్వనాథానికి వెంటనే — 'అంతా అబద్ధం. వీళ్ళ మాటలు నమ్మవద్దు, గౌతమ్ ప్రసాద్. వీళ్ళంతా నీచులు. రాజేశ్వరి మంచిది. నిప్పులాంటిది' అని పెద్దగా అరవా లనిపించింది.

ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక

## దుర్మతి ఉగాది నవలల పోటీ

దుర్మతి ఉగాది సందర్భంలో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నవలల పోటీ నిర్వహిస్తున్నది. నవలల ఎన్నికలో ఎప్పుడూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికదే అగ్రతాంబూలం అని పాఠకులకు తెలును. మంచి నవలలను మాత్రమే ఎన్నిక చేసి ఉత్తమ రచయితలను, రచయిత్రులను ప్రోత్సహించడం మా సంప్రదాయం. ఈసారి కూడా ప్రముఖ రచయితలు, రచయిత్రుల కొత్తవారు ఇతోధికంగా పోటీలో పాల్గొంటారని ఆశిస్తున్నాము.

| | |
|---|---|
| మొదటి బహుమతి | రు 5,000 |
| రెండవ బహుమతి | రు. 3,000 |
| మూడవ బహుమతి | రు. 2,000 |

### నిబంధనలు

★ నవల అరటావు సైజు (ఫూల్‌స్కాప్) కాగితాలలో 250 పుటలు ఉండాలి.

★ సిరాతో కాగితానికి ఒక పక్కనే వ్రాయాలి.

★ నవలా వస్తువు తెలుగువారి జీవితానికి సంబంధించినదై ఉండాలి.

★ అనువాదాలు, అనుసరణలు పోటీకి పనికిరావు.

★ కవరు పైన 'ఉగాది నవలల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.

★ బహుమతి పొందని నవలల్లో యోగ్యమైనవి వారపత్రికలో మామూలుగా ప్రచురించుకునే హక్కు మాకు ఉన్నది.

★ ప్రచురణకు స్వీకరించని నవలలు తిప్పి పంపే నిమిత్తం తగినంత పోస్టేజి అంటించిన, అడ్రెసు ఉన్న కవరు నవలతో జత పరచవలసి ఉంది. లేకపోతే తిప్పి పంపడం సాధ్యం కాదు.

★ ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు.

★ కలం పేరు ఉపయోగించే వారు అసలు పేరు, పూర్తి చిరునామా హామీ పత్రంతో ఇవ్వాలి.

★ బహుమతుల నిర్ణయంలో, సాధారణ ప్రచురణకు అంగీకరించే నవలల విషయంలో ఎడిటర్ నిర్ణయం తుది నిర్ణయం.

★ నవలలు "ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక, దోమల్‌గూడ, హైదరాబాదు–500 029" అడ్రెసుకు పంపవలసి ఉంది.

నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ: 31 జనవరి 1981

అతనికి మాటలు బయటికి రాలేదు. . అయో మయంగా తోచింది.

రాజేశ్వరి ఇరవై రోజుల క్రితం ఏలూరు నించి బదిలీ అయి ఆ ఆఫీసుకు వచ్చింది. ఆమె అంద మైనది. ఎవరినయినా సులభంగా ఆకర్షించగలదు. ఆమె ఆ ఆఫీసులో అడుగు పెట్టిన రోజునుంచీ ప్రతి ఒక్కరూ ( ఒకరిద్దరు ముసలి హెడ్‌క్లర్కులు కూడా ) ఆమెకు వలలు విసిరారు. కాని, రాజేశ్వరిలో అలాంటి వికారాలు ఏవీ లేకపోవటం వల్ల ఎవ్వరి వలలోనూ ఇరుక్కోలేదు. చాలా మంది ఆమె దగ్గర మరీ వెకిలిగా ప్రవర్తించారు. వాళ్ళను తిట్లతో సత్కరించింది ఆమె. ఆఫీసులో అందరూ ఒక అత్యవసర సమావేశం జరిపి ఆమె మంచిది కాదనే ప్రచారం చెయ్యాలనే గట్టి నిర్ణయానికి వచ్చారు.

విశ్వనాధం చూస్తూండగానే గౌతమ్‌ప్రసాద్ చిన్నబుచ్చుకున్న మొహంతో ఇంకేమీ మాట్లాడ కుండా వెళ్ళిపోయాడు. అతను వెళ్ళగానే అందరూ పెద్దగా నవ్వారు.

వాళ్ళ నవ్వు చూస్తూంటే విశ్వనాథానికి వాళ్ళంటే అసహ్యం కలిగింది. 'వెధవ మనుషులు' అనుకున్నాడు.

అతనికి ఆ క్షణంలో తన మిత్రుడు అనుకున్న హనుమంతరావు చెప్పిన మాటలు జ్ఞాపకానికి వచ్చాయి. అతను సుహాసిని గురించి ఎందు కలా చెప్పాడో కూడా అర్ధమయింది. ఎంత అన్యాయం జరిగింది! సుహాసిని కూడా రాజేశ్వరి ఉన్న పరిస్థితిలోనే ఉండి ఉంటుంది. అప్పట్లో తను ఇలా చెప్పే మనుషులు కూడా ఉంటా రని వూహించలేక పోయాడు.

విశ్వనాథం కనుల ముందు మంచు తెరలు తొల గాయి. అతనికి మనసు నిలవలేదు. వెంటనే సుహాసిని దగ్గరికి పరుగున వెళ్ళి, ఆమెను చేసుకోవటం తనకు ఇష్టమేనని చెబుదా మనుకున్నాడు. కాని, ఆమె ఆ సమయంలో ఆఫీసులో ఉంటుందనే విషయం గుర్తు వచ్చింది. సాయంత్రం ఆఫీసు వదలగానే ఆమె ఇంటికి వెళ్ళాలనుకున్నాడు.

సాయంత్రం వరకూ అసహనంగా గడిపాడు.

చివరికి సాయంత్ర మయింది.

ఆఫీసు వదిలారు.

రివ్వున బయటికి వచ్చాడు విశ్వనాథం. అతనికి ఎంతో సంతోషంగా ఉంది. తన కలలు మళ్ళీ నిజం కాబోతున్నాయి. రిక్షాలో వెళితే ఆలస్య మవుతుం దనుకున్నాడు. అందుకని ఆటో ఎక్కి సుహాసిని అడ్రెసు చెప్పాడు.

పది నిమిషాలు గడిచాయి.

ఆటో సుహాసిని ఇంటి ముందు ఆగింది. ఆ ఇంటి తలుపుల మీద అదురుతున్న గుండెతో టకటకా కొట్టాడు.

సుహాసిని తలుపు తెరిస్తే ఆమెకు ఏమని చెప్పాలి? ఎలా చెప్పాలి? విశ్వనాథానికి సిగ్గు అనిపించింది.

భళ్ళున తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా— పాల నురుగులాంటి షిఫాన్ చీరలో బొమ్మలా నిలుచున్న సుహాసిని! ఎత్తయిన గుండె మీద వ్రేలాడుతున్న మంగళసూత్రం!

విశ్వనాథానికి షాక్ కొట్టిన ట్లనిపించింది.

సుహాసినికి పెళ్ళయిందా?!

ఆమె కూడా విశ్వనాథాన్ని చూసి ఆశ్చర్యపోయింది. అతను ఎందుకు వచ్చినదీ అర్థం కాలేదు. ఏదో అడగ బోయింది.

అప్పటికి విశ్వనాథం ఆ షాక్‌నించీ, తనను ఆవ రించుకున్న నిరుత్సాహం నించీ బయటపడ్డాడు.

"సారీ!" అని తనలో తనే గొణుక్కుంటూ గుమ్మం దిగి గబగబా రోడ్డు మీదికి తడబడే అడుగులతో వెళ్ళిపోయాడు.

అతని ప్రవర్తన వింతగా అనిపించి అతన్నే చూస్తూ గుమ్మం దగ్గర బొమ్మ లాగా నిలబడి పోయింది, పెళ్ళయిన సుహాసిని. ★

